

అగళిలో అలంకరణలో మహాలక్ష్మీదేవి

సిరుల తల్లీ.. శరణు..

● భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ● జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ

అగళి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరములిచ్చే తల్లి.. వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లావ్యాప్తంగా మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని అమోఘంగా అలంకరించి, పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.



బస్సుసౌకర్యం లేక బడికి సైకిళ్లపై వెళ్తున్న పోతులకుంట గ్రామ విద్యార్థినులు

ఎర్రబస్సు ఎరుగం..!

జిల్లాలో ఆర్టీసీ బస్సు తిరగని గ్రామాలు 200

ప్రపంచం పరుగులు పెడుతోంది..
డిజిటల్, ఏఐ యుగాలు నడుస్తున్నాయి..
ప్రతి ఒక్కరి చేతిలోకి స్మార్ట్‌ఫోన్ వచ్చింది..
నేటికీ ఊరికి ఎర్రబస్సు మాత్రం రాలేదు.
పదో, పాతికో ఉన్నాయనుకుంటే పొరబాటే..
జిల్లాలో 200 గ్రామాలు ఆర్టీసీ బస్సు ఎరుగవు..
నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా ఇది నిజం..
కొన్ని ఊళ్లకు ఉన్నా.. ఎప్పుడొస్తుందో తెలీక..
గంటల తరబడి రోడ్లపై నిరీక్షించాల్సి వస్తోంది..
పల్లెకు ప్రయాణమంటే నరకప్రాయమే..
గ్రామ ప్రజలకు ప్రైవేటు వాహనాలే దిక్కు..
వందలాది మంది విద్యార్థులు
కాలిబాటనే బడికి చేరుతున్నారు..

కొన్ని రూట్లలో ఉన్నా.. సమయానికి రాక తిప్పలు

● ప్రైవేటు వాహనాలే దిక్కు ● చాలామంది విద్యార్థులకు తప్పని నడక

కొత్తచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా గ్రామాలు.. ఆర్టీసీ బస్సులు ఎరగవు. తారు రోడ్డు ఉన్నా బస్సులు వెళ్లకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న గ్రామాలకు కూడా సర్వీసులు లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని రూట్లలో బస్సులేక, మరికొన్ని దారుల్లో ఉన్నా.. సకాలంలో రాక విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనులపై మండల, పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు సైకిళ్లపై నిత్యం 4 నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ... అష్టకష్టాలు పడుతున్నారు.

రోడ్లు ఉన్నా..

జిల్లాలో 2356 గ్రామాలు ఉన్నాయి. 400 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో పల్లెవెలుగు 280, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 120 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 300 పైచిలుకు గ్రామాలకు నేటికీ ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని ఆ సంస్థ గణాంకాల ద్వారా తెలుస్తోంది. గతంలో రహదారి సౌకర్యంలేదని పలు గ్రామాలకు బస్సు సర్వీసులను నిలిపివేశారు.కలెక్షన్లు లేవంటూ మరి కొన్నింటిని సంస్థ రద్దు చేసింది. ప్రస్తుతం పలు గ్రామాలకు కొత్త రోడ్లు వేశారు. అయినా, బస్సులు తిప్పకపోవడం గమనార్హం.

బస్సులు లేక ప్రైవేటు వాహనాల్లో..

జిల్లాలో పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను సైతం తగ్గించినట్లు తెలుస్తోంది. బస్సు సౌకర్యంలేక విద్యార్థులు, ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఆటోలకు డబ్బుల్లేక కాలినడకన పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. బంగారుచెన్నేపల్లి, మీర్జాపురం, కొత్త, పాత దేవరపల్లుల నుంచి మరకుంటపల్లి, వేములేటిపల్లి నుంచి తలమర్లలోని హైస్కూల్‌కు బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు సైకిళ్లపై, ఆటోల్లో, మరికొందరు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్నారు. బండ్లపల్లిలోని హైస్కూల్‌కు బైరాపురం, సాయినగర్, అప్పలవాండ్లపల్లి, పోతులకుంట, వన్నూరప్పపల్లి, విరుపాపురం, ఓబులదేవరపల్లి మరికొన్ని గ్రామాల నుంచి తారురోడ్డు సౌకర్యం ఉంది. బస్సులేదు. దీంతో హైస్కూల్‌కు 4 నుంచి 5 కిలోమీటర్లు సైకిళ్లపై, నడుచుకుంటూ వెళ్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సులు నడపాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

మినీ పల్లెవెలుగు బస్సులు నడపాలి

వెల్దుర్తి క్రాస్ నుంచి వెల్దుర్తి, గంగినేపల్లి,తండా, దూపంపల్లి, సిద్దరాంపురం, చెన్నరాయునిపల్లి, నారేపల్లి క్రాస్, నారేపల్లి, మైలసముద్రం, కేశాపుం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. తారురోడ్డు వేశారు. ఆర్టీసీ కండక్టర్ లేకుండా 30 మంది సామర్థ్యంతో మినీ పల్లెవెలుగు బస్సులు నడిపితే బాగుంటుంది. -నరసింహుడు, కేశాపురం

అన్ని గ్రామాలకు బస్సుసౌకర్యం కల్పిస్తాం

జిల్లాలో తారురోడ్డు సౌకర్యం ఉన్న అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం. గతంలో రోడ్లు సరిగా లేకపోవడం, ప్రైవేటు వాహనాలు, ఆటోల ప్రభావంతో కలెక్షన్లు లేక బస్సుల నిర్వహణ భారంగా ఉండేది. దీంతో కొన్ని సర్వీసులను నిలిపివేశాం. ప్రజలు.. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సంస్థ లాభాల్లోకి వస్తుంది. తద్వారా అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించే వీలుంటుంది.
-మధుసూదన్,
ఆర్టీసీ రీజనల్ మేనేజర్

బడికెళ్లాలంటే లిఫ్ట్ అడగాల్సిందే..



మరకుంటపల్లిలో హైస్కూల్ లేదు. 3 కిలోమీటర్ల దూరంలోని తలమర్ల ఉన్నత పాఠశాలకు 15 మంది వరకు గ్రామం నుంచి వెళ్తున్నాం. బస్సు సౌకర్యం లేకపోవడంతో రోజూ బడికి కొందరు సైకిళ్లపై, మరి కొందరు నడుచుకుంటూ, కొంతమందిని తల్లిదండ్రులు బైక్‌లపై తీసుకెళ్తున్నారు. ఎవరైనా తలమర్ల వైపు బైక్‌పై వెళ్తుంటే వారిని లిఫ్ట్ అడుగుతాం. కొందరు నిలుపుతారు, ఇంకొందరు నిలపరు. దీంతో బడికి కొన్నిసార్లు ఆలస్యం అవుతుంది. క్లాసులు మిస్‌కాకుండా బడికి గంట ముందుగా బయల్దేరి వెళ్తున్నాం.
- విష్ణువర్ధన్, 7వ తరగతి, మరకుంటపల్లి

ఐదేళ్లుగా సైకిల్‌పై వెళ్తున్నా



మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. 5 కిలోమీటర్ల దూరంలోగల బండ్లపల్లి హైస్కూల్‌కు రోజూ పదిమందిదాకా సైకిళ్లపై వెళ్తున్నాం. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. కొంతమందికి సైకిళ్లు లేక నడుచుకుంటూ వెళ్తున్నారు. ప్రభుత్వం.. విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.
- మేఘన, 10వ తరగతి, పోతులకుంట

ముడుపులిస్తేనే మోక్షం..!

రెవెన్యూశాఖలో హెచ్చుమీరిన అక్రమాలు

● సబ్‌డివిజన్ చేయాలంటే రూ.2లక్షలివ్వాలట
● ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో మాయాజాలం
● లబోదిబోమంటున్న బాధితులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ప్రతి పనికీ ఓ రేటు పెట్టారు. మాన్యువల్ డెత్ సర్టిఫికెట్ నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వరకు డిమాండ్‌ను బట్టి వసూలు చేస్తుంటారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలు లేకుండా ఏవైనా సర్టిఫికెట్లు, పత్రాలు తీసుకోవడం కుదరదనే విమర్శలున్నాయి. సర్వే కోసం వెళ్లినా ముడుపులు చెల్లించాల్సిందే. డైక్లాట్‌లో వివరాల కోసం పైసలు ముట్టజెప్పాల్సిందే. ఇలాంటి పనులకు ఎంతో కొంత ఇస్తే చాలు పనైపోతుందని సామాన్యులు సైతం అంటున్నారంటే పరిస్థితి ఎంత ముదిరిపోయింతో అర్థం చేసుకోవచ్చు. ఇక సబ్ డివిజన్ చేసుకోవాలంటే సర్వేయర్‌ను, రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకోవడం సామాన్యుడికి తలకు మించిన భారం అవుతోంది. ఉన్నతాధికారులకు ఈ వ్యవహారం తెలిసినా చర్యలు తీసుకోకపోవడం వల్లనే (మిగతా 6వ పేజీలో...)

ముడుపులిస్తేనే ఫ్యామిలీ సర్టిఫికెట్

ఏదైనా భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించుకునే క్రమంలో కావాల్సిన పత్రాలు, సర్టిఫికెట్లలో ప్రధానమైంది ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్(ఎఫ్ఎంసీ). ఈ సర్టిఫికెట్ రావాలంటే నెలపైగా ఎదురుచూడాల్సి ఉంటుంది. పైసలు ముట్టజెబితే త్వరగానే చేతిలోకి వచ్చేస్తుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్ఓ నుంచి ఆర్ఐ వరకు సంబంధిత పత్రాలు పరిశీలిస్తారు. ఈ సర్టిఫికెట్ కోసం డిమాండ్‌ను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇక సరైన ఆధారాలు లేకుండా, గిమ్మిక్కులు చేయాలంటే మాత్రం పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ రూ.లకారాల్లో పలుకుతోందట. మూడు నెలల కిందట అనంతపురం పరిధిలో కీలకమైన పోస్టులో ఉండే ఓ రెవెన్యూ ఉద్యోగి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఏకంగా రూ.2లక్షలు వసూలు చేశాడట. ఈ విషయంపై అధికారపార్టీ ప్రజాప్రతినిధి తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఇతను పైసలు లేనిదే ఫైల్స్ ముట్టడనే ఆరోపణలున్నాయి.



ఎఫ్ఎంసీ

దానం ఇచ్చినా పట్టదా?

దాత ఇచ్చిన స్థలంలో సచివాలయ నిర్మాణం

90 శాతం పూర్తి.. సగం బిల్లు చెల్లింపు
ఏళ్లు గడిచినా రిజిస్ట్రేషన్ చేసుకోని అధికారులు
భవిష్యత్తులో సమస్య వస్తే ఎవరిది బాధ్యత?



శేషాపురం గ్రామంలో ప్రైవేట్ స్థలంలో నిర్మించిన సచివాలయం

రొద్దం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉదాసీనత సచివాలయ నిర్మాణం పూర్తి కావడానికి అడ్డంకిగా మారింది. దాత ఇచ్చిన స్థలాన్ని ఏళ్లు గడిచినా రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం ఇబ్బందికర పరిస్థితికి దారి తీస్తోంది. మండలంలోని శేషాపురం గ్రామంలో సచివాలయ నిర్మాణం కోసం ఐదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం రూ.40 లక్షల ఉపాధి నిధులు కేటాయించింది. అయితే అనువైన ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు జగన్నాథ్‌రెడ్డి తన భార్య సుగుణ పేరుతో సర్వేనంబరు 512లో ఉన్న 10సెంట్ల స్థలాన్ని సచివాలయ నిర్మాణానికి దానం చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ స్థలం ప్రభుత్వం పేరుతో బదలాయింపు జరగలేదు. స్థలం దానంగా ఇచ్చినందుకు సచివాలయ నిర్మాణ పనుల కాంట్రాక్ట్‌ను జగన్నాథ్ రెడ్డికే అప్పగించారు. ఈక్రమంలో సచివాలయ నిర్మాణం 90శాతం పూర్తి అయ్యింది. ఇందుకు పంచాయతీరాజ్ అధికారులు రూ.19,31,426లు బిల్లులు అందజేశారు. మిగిలిన బిల్లులు ఇవ్వలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తన బిల్లులు వచ్చాక స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయిస్తానని దాత అంటున్నారు. ముందుగానే స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తే, తనకు బిల్లులు అందకపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాత స్థలం ఇచ్చినప్పుడే రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఈ విషయంపై పంచాయతీరాజ్‌శాఖ మండల ఇంజనీర్లు వెంకటరమణను వివరణ కోరగా తనకు ఆ విషయం తెలియదని, తనకన్నా ముందున్న మండల ఇంజనీర్ చేయించాల్సి ఉందన్నారు.

పట్టించుకోని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు

ప్రైవేట్ స్థలంలో సచివాలయాన్ని నిర్మించి, దాదాపు సగం బిల్లులు చెల్లించి, తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిడితో ప్రైవేట్ స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్లను రెవెన్యూ అధికా రులు కట్టబెట్టి చేతులు దులిపేసుకున్నారన్న విమర్శలున్నాయి. ప్రైవేట్ స్థలం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లుగా పొజిషన్ సర్టిఫికెట్‌ను ఎలా ఇస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించడా నికి దాత సిద్ధంగా ఉన్నా అధికారులు అందుకు అనుగుణంగా స్పందించడంలేదన్న విమర్శలున్నాయి.



నీకు నేను.. నాకు నీవు రక్ష

నేడు రాఖీ పౌర్ణమి



హిందూపురంలో రాఖీల కొనుగోలు

ఒక కొమ్మకు పూచిన పువ్వులై
సుగంధ పరిమళాలు వెదజల్లి..
ఒక ఇంటన వెలిగే దివ్వెలై
కారు చీకట్లను తొలగించి..
అనురాగానికి చిరునామాగా
ఆత్మీయతకు ఆలంబనగా
అమ్మనాన్నల నీడన ఎదిగి
జీవిత పర్యంతం
ఒకరికొకరు రక్షగా ఉండే రాగ బంధం
అన్నా, చెల్లెలు, అక్కాతమ్ముడు అనుబంధం
పున్నమి వెన్నెలలా హాయిని గొలుపుతూ
కన్నవారి ఇంటిని బృందావనం చేసే సూత్రం
రక్షా బంధనం..
బంధాలు, బాధ్యతల కలబోతగా
భారతీయులు జరుపుకునే
రాఖీ పౌర్ణమి నేడు (వివరాలు 6లో...)



తెగిపోయిన కల్వర్టు

తెగిన కల్వర్టు

ముదిగుబ్బ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ముదిగుబ్బ నుంచి మల్లేపల్లికి వెళ్లే రోడ్డులో ఈదాల వంక వద్ద కల్వర్టు గురువారం రాత్రి కురిసిన వర్షాలకు తెగిపోయింది. 15 గ్రామాలకు రాకపోకలకు ఆగిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ నాయకులు కల్వర్టు వద్దకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి గిరి ప్రదక్షిణను బాబా భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని గణేష్ గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి రథాన్ని లాగుతూ భక్తి పాటలు పాడుతూ గిరిప్రదక్షిణ నిర్వహిం చారు. ఈ గిరి ప్రదక్షిణ గోకులం ఎనుములపల్లి, గణేష్ సర్కిల్, పెట్రోల్ బంక్, చింత తోపు, గోవింద పేట, శివాలయం వీధి, గోపురం రోడ్డు మీదుగా సాగింది. తిరిగి గణేశ్ గేట్ వద్దకు చేరుకొనగా మహా మంగళహారతితో గిరి ప్రదక్షిణను ముగించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

సమస్యల గురుకులం...!

(వివరాలు 6లో..)

బిగుస్తున్న ఉచ్చు..!

దాల్‌మిల్ సోదరుల కోసం పోలీసుల వేట
(వివరాలు 7లో..)



దాల్‌మిల్ సూరి



లింగారెడ్డిపల్లి వద్ద పొలంలో నిలిచిన వర్షం నీరు

దంచికొడుతున్న వాన

ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్/కొత్తచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వర్షం పడింది. అనంతపురం, పుట్లూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. రాయదుర్గం, నార్పల, తాడిపత్రి, బొమ్మనహాళ్, బెళుగుప్ప తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 7 మండలాల్లో గురువారం రాత్రి వర్షం (మిగతా 7వ పేజీలో..)

యుద్ధప్రాతిపదికన
లైనింగ్ పనులు

● కలెక్టర్ టీఎస్ చేతన్



కాలువ లైనింగ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

బుక్కపట్నం, ఆగసు8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మండలంలోని చెండ్రాయునిపల్లి సమీపాన చేపడుతున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ప్యాకేజీ 4లో భాగంగా చేపడుతున్న సొరంగం పనులను ఆయన దాదాపు 600 మీటర్ల వరకు వెళ్లి నాణ్యతను పరిశీలించారు. హంద్రీనీవా ద్వారా పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాలువలకు నీరు వదలడానికి సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో, గట్టున ఉన్న విద్యుత్ స్తంభాలను ఆగస్టు 15లోపు తొలగించాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజస్వరూప్ కుమార్, ఈఈ మురళి, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, బీఎన్ఆర్ ఏజెన్సీ డైరెక్టర్ పూర్ణప్రసాద్ పాల్గొన్నారు.

రూ.కోట్లు వృథా..!

నిరుపయోగంగా డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలు
(వివరాలు 7లో..)



స్నేహితులతో కలిసి మొక్క నాటుతున్న నవని (స్కూల్ యూనిఫాంలో ఉన్న చిన్నారి)

అవని కోసం నవని..!

చిన్నారి పర్యావరణ ప్రేమ

257 మొక్కలు నాటిన అనంత బాలిక

● 3 వేల మొక్కల పంపిణీ ● వాటి సంరక్షణకు చర్యలు ● కేంద్ర మంత్రి ప్రశంసలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మూడో తరగతి చదువుతున్న బాలిక పర్యావరణ పరిరక్షణకు కదిలింది. మొక్కలు నాటుతూ, వాటిని పరిరక్షిస్తూ అందరి మన్ననలు పొందుతోంది అనంతపురానికి చెందిన నవని. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మా కె నామ్ (తల్లి పేరుతో మొక్క నాటుదాం) అంటూ ఇచ్చిన పిలుపు పట్ల ఆకర్షితురాలై మొక్కలు నాటడంతో పాటు ఉచితంగా వాటిని పంపిణీ చేస్తోంది. ఇప్పటివరకు 257 మొక్కలు నాటి వాటిని స్వయంగా పరిరక్షిస్తోంది. 3 వేల మొక్కలు పంపిణీ చేసి, వాటిని ఎక్కడెక్కడ నాటారనే అంశాలపై తరచూ ఆరా తీస్తూ వాటి పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తోంది.

మూడో తరగతి బాలిక.
పసి వయసులోనే
పర్యావరణంపై ప్రేమ పెంచుకుంది.
భూమి పరిరక్షణకు
చిరు ప్రయత్నం మొదలెట్టింది.
పచ్చదనం పెంచేందుకు కదిలింది.
వందల మొక్కలు నాటింది..
వాటిని పరిరక్షిస్తోంది.. వేలల్లో
పంపిణీ చేసింది..
అవి ఎలా ఉన్నాయని ఆరాతీస్తోంది..
పచ్చని చెట్లపై ఎంత
పిచ్చి ప్రేమో..
ఆ పసి
పాపకి..



నవనిని అభినందిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

నరేంద్ర మోదీ పిలుపుతో..

నగరానికి చెందిన అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, కల్పన దంపతుల ఏకైక కుమార్తె నవని. అనంతపురంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో మూడో తరగతి చదువుతోంది. తండ్రి సుంకర రమేష్ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి పొందింది. చిన్నతనంలోనే సేవాబాట పట్టింది. మొక్కల పరిరక్షణకు అనువుగా, అవకాశం ఉండే ప్రాంతాలను ఎంచుకుంటోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కుల్లో మొక్కలు నాటడం మొదలెట్టింది. పండుగలు, సెలవు రోజుల్లో మొక్కలు నాటుతోంది.

కేంద్ర మంత్రుల అభినందనలు

చిన్నారి నవని చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. నవని మొక్కలు నాటడం, ఉచితంగా పంపిణీ చేయడంపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను కేంద్రప్రభుత్వం గుర్తించింది. నవనిని మేరా సర్కార్ అధికారులు ఢిల్లీకి ఆహ్వానించారు. అక్కడికెళ్లి నవని చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అవనిని కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి సతీష్‌చంద్ర దూబే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, టీడీపీ పార్లమెంటు ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు. ఏక్ పేడ్ మా కె నామ్ అమలులో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థులతో ప్రధానమంత్రి మోదీ నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమంలో నవని పాల్గొననుంది. చిన్న వయసులో ఢిల్లీ స్థాయిలో గుర్తింపు పొందిన నవనిని అందరూ అభినందిస్తున్నారు.

ముడుపులిస్తేనే మోక్షం..!

(5వ పేజీ తరువాయి)

మరింత రెచ్చిపోతున్నారన్న విమర్శలున్నాయి.

సబ్ డివిజన్ చేయాలన్నా..

సబ్ డివిజన్ కోసం అధికారులకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. జిల్లా అంతటా అన్ని మండలాల్లో ఇదే వ్యాపారం సాగుతోంది. గార్లదిన్నె తహసీల్దారు కార్యాలయంలో అంతా తానై వ్యవహరిస్తున్న ఓ అధికారి సబ్‌డివిజన్ కోసం పెద్దగానే డిమాండ్ చేస్తున్నారట. ఆ మండలంలోని శిరివరం గ్రామానికి చెందిన షబ్బీర్ అలీ సబ్‌డివిజన్ కోసం తహసీల్దార్ కార్యాలయం వెళ్లాడు. శిరివరంలోని సర్వేనెంబరు 217లో 3.50 ఎకరాల భూమిని ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా గతంలో మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించి, పాస్‌బుక్కు అందజేశారనేది బాధితుని ఆరోపణ. ఈ నేపథ్యంలో కోర్టు పరిధిలో ఉన్న 3.5 ఎకరాలు మినహాయించి తమకు చెందిన 14 ఎకరాలు సబ్ డివిజన్ చేయాలని కోరాడు. ఇందుకు సంబంధిత అధికారి రూ.2లక్షలు ఇస్తే సబ్‌డివిజన్ చేస్తానని హామీ ఇచ్చారట. దీంతో తన భూమి సబ్ డివిజన్‌కు అంత ఇచ్చుకోలేనని వెనక్కువచ్చేశాడట. మరోసారి అడిగినా ఆయన అదే విషయం చెబుతూ అది కాకపోతే ప్రత్యర్థి వర్గానికి ఎకరా భూమి రాసివ్వాలని బేరం పెట్టారట.

బోగస్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో...



షేక్ మస్తాన్‌బీ ఆధార్‌లో పేరు

షబ్బీర్‌కే చెందిన కల్లూరులోని రూ.50లక్షల విలువైన 6 సెంట్ల స్థలాన్ని కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జూన్ 4న పామిడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ చేశారు. అయితే ఇది అక్రమమని బాధితుడు సబ్‌రిజిస్ట్రార్‌ను కలిశాడు. తాను వంశవృక్షం చూసి ఇచ్చానని పామిడి సబ్‌రిజిస్ట్రార్ చెప్పుకొచ్చారట. ఇదే విషయంలో గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం అధికారులు జూన్ 13న ఎఫ్ఎంసీ జారీ చేయడం గమనార్హం. సంబంధిత వ్యక్తులకు ఇచ్చిన ఫ్యామిలీ సర్టిఫికెట్ నకిలీదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. స్థలం బాధితుడి పెదనాన్న ఇమాంసాబ్‌ది. ఆయన మృతి చెందాడు. ఆయన మొదటి భార్య హఫీజాబీ కొడుకు షెక్షావలి. అంతే. కానీ అవతలివారు రెండో భార్యగా షేక్ మస్తాన్‌బీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో సృష్టించారు. రెండో భార్య ఉన్నది వాస్తవమే అయితే ఆధార్‌లో, ఎఫ్ఎంసీలో, వంశవృక్షంలో తేడాలుండటం నకిలీదని స్పష్టం చేస్తోంది. దీనికితోడు ఇమాంసాబ్ పేరు కూడా తప్పుగా ఉంది. ఆధార్‌లో షేక్ మస్తాన్ బీ భర్త ఎస్.ఇమాములు అని ఉంది. గార్లదిన్నె మండల అధికారులు ఇచ్చిన ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో షేక్ మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్ అని ఉంచారు. ఇక వంశవృక్షంలో వై.మస్తాన్ బీ భర్త వై.ఇమాంసాబ్‌గా ఉంది. ఇంత గందరగోళం ఉంటే గార్లదిన్నె తహసీల్దార్ పేరుతో ఆ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారనేది సందేహాలకు తావిస్తోంది. అదేవిధంగా ఆన్‌లైన్ మ్యుటేషన్‌లోనూ వై.మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్‌గా ఉంది.

డబ్బులు అడుగుతున్నారు: షబ్బీర్ అలీ, శిరివరం, గార్లదిన్నె మండలం



సర్వేనెంబరు 217లో 3.5ఎకరాలు ఆక్రమించారు. 14ఎకరాలు సబ్‌డివిజన్ చేయమంటే రెవెన్యూ అధికారులు డబ్బులు అడుగుతున్నారు. కల్లూరులోని ఆరు సెంట్లలోనూ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. ఆధారాలు లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సైతం రిజిస్ట్రేషన్ అయ్యాక ఎలా ఇచ్చారు. అందులోనూ అన్నీ తప్పులే ఉన్నాయి. అధికారులు ఇది గమనించలేరా..?

సమస్యల గురుకులం...!

● వేధిస్తున్న తరగతి గదుల కొరత
● ఆరు బయటే స్నానాలు, భోజనాలు
● కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు
● ఇబ్బందుల్లో విద్యార్థులు

గార్లదిన్నె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల అసౌకర్యాలకు నిలయంగా మారింది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం మూడో రోడ్డులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను భవనాల కొరతతో గార్లదిన్నెకు మార్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం నిర్మించిన భవనంలోకి 2016లో దీన్ని తరలించారు. మైనార్టీ గురుకుల పాఠశాల భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రాప్తాడు సమీపంలో 6.72 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అలాగే భవన నిర్మాణం కోసం రూ. 17 కోట్లు మంజూరు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ మైనార్టీ గురుకుల పాఠశాలకు సొంత భవనం సమకూరకుండా ఉంది. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ భవనం విద్యార్థులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో సుమారు 400 పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 12 గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా చిన్న విస్తీర్ణంతో ఉండటంతో పగలు తరగతి గదులుగా... రాత్రి పడక గదులుగా వినియోగించుకుంటున్నారు. విద్యార్థుల సామగ్రి కూడా అదే గదులలోనే నిల్వ ఉంచడంతో గదులు పూర్తి ఇరుకుగా మారాయి. మరుగుదొడ్లు, స్నానపు గదుల కొరత తీవ్రంగా ఉంది. భోజనశాల, వంట గదులు అసలే లేవు. దీంతో విద్యార్థులు తమ అన్ని పనులను ఆరుబయటే కానిస్తున్నారు. ఇరుకు గదుల్లో ఎక్కువ మంది ఉండటం వల్ల సీజనల్ వ్యాధుల తొందరగా ప్రబలుతున్నాయి. పర్యవేక్షణకు వచ్చిన అధికారులతో సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్ని సార్లు ఆవేదన వ్యక్తం చేసినా ఫలితం శూన్యం.

పట్టించుకోని పాలకులు, అధికారులు

మైనార్టీ గురుకుల పాఠశాలను పలుమార్లు అధికారులు, పాలకులు సందర్శించడమే తప్ప దాని అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పాఠశాలను సందర్శించిన ప్రతిసారీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రగల్భాలు పలకడం తప్ప చేసిందేమీ లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ పిల్లలకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



ఆరుబయటే స్నానాలు చేస్తున్న విద్యార్థులు



తలుపులు లేని మరుగుదొడ్లు



ఆరుబయటే భోజనం చేస్తున్న విద్యార్థులు

అన్నీ గదులలోనే...



పాఠశాలలో సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చదువుకునే గదులలోనే నిద్రపోతున్నాం. ఆదే గదిలోనే సామగ్రి పెట్టుకుంటున్నాం. ఒకే గదిలో చదువు, నిద్ర, సామగ్రి అంటే ఇబ్బందిగా ఉంది. దీంతో పగలు తరగతి గది...రాత్రి పడక గదిలా గడుపుతున్నాం. ఒక్కో గదిలో 70 నుంచి 80 మంది ఉంటున్నాం.

-ఎల్లప్ప, విద్యార్థి పదో తరగతి, పత్తికొండ

గదుల కొరత తీవ్రంగా ఉంది



పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. ఈ పాఠశాలలో అన్ని సమస్యలే. చదువుకోవాలన్న, నిద్రపోవాలన్న తీవ్ర ఇబ్బందులు పడు తున్నాం. భోజనం చేసేందుకు గదిలేకపోవడంతో ఆరుబయటే తింటున్నాం. వర్షం వస్తే తడుస్తు భోజనం చేయాలి. గురుకుల పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్కరికి సమస్యను చెబుతున్నా ఫలితం లేదు. గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించి విద్యార్థుల చదువుకు సహకరించాలి.

- షెక్షా, విద్యార్థి డోన్

మా సమస్య పరిష్కరించే నాథుడే లేడు



మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే నాథుడే లేడు. ఐదో తరగతి నుంచి మైనార్టీ గురుకుల పాఠశాలలోనే చదువుకుంటున్నాం. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. అధికారులు, నాయకులు వస్తారు. పాఠశాలను సందర్శిస్తారు. అయితే సమస్యలను మాత్రం పరిష్కరించిన పాపన పోలేదు. అధికా రులు, నాయకులు స్పందించి మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. - హరివాజ్ విద్యార్థి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మైనార్టీ గురుకుల పాఠశాలలో తరగతి గదుల కొరత ఉన్న విషయం వాస్తమే. విద్యార్థులకు భవనం సరిపోవడంలేదు. భవనంలో 12 గదులు మాత్రమే ఉన్నాయి. గదుల కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవలే 6 బాతురూంలు నిర్మించాం. ఒక స్టేజ్ నిర్మించాం. మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తామంటున్నారు.

-ఆంజనేయులునాయక్, ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల పాఠశాల





నీకు నేను.. నాకు నీవు రక్ష

నేడు రాఖీ పౌర్ణమి

అనంతపురం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దూరం పెరిగినా, కాలం మారినా, ఎన్నటికీ చెరగనిది, తరగనిది అన్నాచెల్లెళ్ల అనుబంధం. ఒకరికి ఒకరు అండగా ఉన్నామనే ధీమానిచ్చే బంధం. సోదర బంధానికి గుర్తుగా జరుపుకునే పండుగ రాఖీ. కులమతాలకు అతీతంగా సోదర సోదరీమణులు రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. శనివారం రాఖీ పౌర్ణమి నేపథ్యంలో తమ సోదరులకు రాఖీలను కట్టేందుకు సోదరీమణులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రాఖీ కొనుగోలుదారులతో దుకాణాలు సందడిగా మారాయి.



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు

కులమతాలకు అతీతమైన వేడుక



సమాజంలో కులమతాలకు అతీతంగా జరుపుకునే వేడుక రాఖీ పండుగ. అందుకే అన్నివర్గాల వారికి భరోసా కల్పిస్తూ ప్రజాపిత బ్రహ్మకుమారీలంతా కలిసి రాఖీలు కట్టి ఆత్మీయతను పంచుకుంటున్నాం. ప్రపంచమంతా ఒకే కుటుంబం లాంటిదని మన పురాణాలు చెబుతున్నాయి. అందుకే రాఖీ పండుగను కేవలం భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం.

- శారద, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం

ఉద్యాన పంటల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

● ఎన్‌హెచ్‌బీ ఎండీని కోరిన ఎంపీ అంబికా



ఎన్‌హెచ్‌బీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం, ఆగస్టు 8(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేక తోడ్పాటును అందించాలని జాతీయ ఉద్యాన బోర్డు (ఎన్‌హెచ్‌బీ) ఎండీ ప్రియంరంజన్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌బీ ఎండీని శుక్రవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ అంబికా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై ఎండీకి ఆయన వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యాన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.505 కోట్లలో దాదాపు రూ.300 కోట్లు విడుదల చేయలేదన్నారు. అయితే రాష్ట్రంలో ఇప్పటికే కుప్పంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ) ను అనుసరించి చిత్తూరు జిల్లా కుప్పంతోపాటు పల్నాడు, అరకు ప్రాంతాల్లో కొత్తగా సీఈఓలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అనంత జిల్లాలో అరటి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, జామ, సపోట, టమోటా తదితర ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఎండీని ఎంపీ కోరారు. రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్‌లు, పోస్ట్ హార్వెస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లతోపాటు పెండింగ్ ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతి ఇవ్వాలన్నారు. రైతులకు మార్కెట్ లింకేజీలు, విలువ జోడింపు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభ్యున్నతి, ఉద్యాన రంగ అభివృద్ధిపై మరింత చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు.

'సూపర్ స్పెషాలిటీ'లోనూ అత్యవసర సేవలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా అత్యవసర సేవల(ఎమర్జెన్సీ) విభాగాన్ని ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 11నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. అందుకు తగిన వైద్య సిబ్బంది, సహాయక సిబ్బంది, అవసరమైన సదుపాయాలు సమకూర్చి 24గంటలూ నిరంతరాయంగా సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

షట్లర్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. నేషనల్ స్పోర్ట్స్‌ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అండర్-19బాలుర విభాగంలో శ్యామ్ నాథ్, రిహాన్, నివాస్, ఇషాన్, తలాహా ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మౌనిక, రిధి, ఇంద్రాణి, గుణసాయి. ఇందు, సాస్మిక, హారిక ఎంపికయ్యారు. వీరు తిరుపతిలో ఈనెల 12న జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శాప్ కోచ్ నరేష్‌కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన షట్లర్లు



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 771 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.37

అనంతపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.20, సరాసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.



క్రైం కార్నర్

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య



యువకుడి మృతదేహం

గోరంట్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. మృతుడి వయసు 25నుంచి 30ఏళ్ల లోపు ఉంటుందన్నారు. ప్రధాన రహదారికి సమీపంలోని చెట్టుకు టవల్‌తో ఉరివేసుకోగా, స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై ప్యాంటు, షర్టు ఉన్నాయి. చెప్పులు చెట్టువద్ద వదలగా, లాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు పేర్కొన్నారు. కుడి చెయ్యి అరచేతి పైభాగంలో నాగుపాము గుర్తు, చేయి పైభాగంలో అమ్మ ఏఎస్ అని పచ్చబొట్టు వేయించుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ మృతి

● అవ్వ మృతిని జీర్ణించుకోలేక మనవడు ఆత్మహత్య



హనుమేష్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అవ్వ మరణం తట్టుకోలేక మనవడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దేవగిరి క్రాస్‌లో జరిగింది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. కురుబ హనుమేష్ (22) ఈనెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 5న మృతుడి అవ్వ మల్లమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందింది. చిన్నప్పటి నుంచి అల్లరుముద్దుగా పెంచిన అవ్వ దూరమవడంతో హనుమేష్ తట్టుకోలేక అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మూడురోజుల్లో తల్లిని, కొడుకును పోగొట్టుకున్న ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి తండ్రి వన్నూరుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

జీవితంపై విరక్తితో యువకుడి బలవన్మరణం

తాడిపత్రి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరిచింతల గ్రామానికి చెందిన వెంకటరమణ (29) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వెంకటరమణ 2021లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇతను జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది మద్యంలో రంగుపొడర్‌ను కలుపుకొని తాగాడు. అపస్మారకస్థితిలో పడిఉన్న వెంకటరమణను స్థానికులు గుర్తించి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబికులు తెలిపారు. మృతుడికి భార్య దేవితోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెన్సిల్ గొడవ కేసులో నిందితుల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న సీఐ

కళ్యాణదుర్గం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెన్సిల్ గొడవలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు విద్యార్థులు బడిలో పెన్సిల్ కోసం గొడవ పడటం, అది వారి తల్లిదండ్రులకు చేరడం, ఆపై జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం పాఠకులకు విదితమే. ఈ సంఘటనకు సంబంధించి కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వరరావు ఐదుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాల మేరకు శెట్టూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మూడో తరగతి చదువుతున్నారు. వీరిద్దరు పెన్సిల్ కోసం గొడవ పడ్డారు. బడి వదిలాక సాయంత్రం ఇంటికెళ్లి ఇరువురు వారి తల్లిదండ్రులకు చెప్పారు. తమ కొడుకును కొట్టారని ఓ బాలుడి తల్లిదండ్రులు మర్రిస్వామి, మరియమ్మ ఆగ్రహించారు. మరో బాలుడి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులు ప్రకాష్, ప్రమీళమ్మపై దాడి చేశారు. ఈక్రమంలో తీవ్రంగా గాయపడిన ప్రకాష్ మృతి చెందాడు. ఈ సంఘటనను పూర్తిస్థాయిలో విచారించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. శెట్టూరు గ్రామానికి చెందిన చింతర్లపల్లి మారెక్క, కరిడిపల్లి వన్నూరక్క, శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లికి చెందిన లక్ష్మణ్ణ, రాజు, ఇదే మండలం కరిడిపల్లి గ్రామానికి చెందిన హరిజన తిప్పేస్వామిలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు..

గుంతకల్లుటౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన దాసరి గోవిందు హత్య కేసులో నిందితుడైన దాసరి ఓబయ్యను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్పతో కలిసి రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. దాసరి గోవిందు ఇంటి పక్కనే అతడి సమీప బంధువు దాసరి ఓబయ్య నివాసముంటున్నాడు. దాసరి ఓబయ్య, అతడి కొడుకు దాసరి రుశిదాసుతో ప్రతి రోజు దాసరి గోవిందు గొడవ పెట్టుకుని, అసభ్యకరంగా మాట్లాడేవాడు. దీంతో దాసరి గోవిందును అడ్డుతొలగించుకోవాలని తండ్రీకొడుకులు పథకం రచించారన్నారు. బుధవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న దాసరి గోవిందును దాసరి ఓబయ్య, దాసరి రుశిదాసులు వేటకొడవలితో నరికి హత్య చేశారన్నారు. శుక్రవారం హనుమాన్ సర్కిల్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న దాసరిఓబయ్యను అరెస్ట్ చేశామన్నారు. దాసరి రుశిదాసు పరారీలో ఉన్నాడు అతడి కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.కోట్లు వృథా..!

నిరుపయోగంగా డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలు

● మొబైల్ యాప్‌ల రాకతో కొరవడిన ఆదరణ
● ప్రభుత్వానికి భారంగా యంత్రాల నిర్వహణ

కొత్తచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి, తెచ్చిన డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలు నిర్వహణ ప్రస్తుత ప్రభుత్వానికి భారంగా మారింది. దీంతో ఆ యంత్రాలు మూలకు చేరాయి. వైసీపీ పాలనలో 2020-21లో డిజిటల్ కియోస్క్ యంత్రాలు, టీవీలను రైతుల కోసం కొనుగోలు చేసి, రైతు భరోసా కేంద్రాల్లో (రైతు సేవా కేంద్రాలు)ఉంచింది. ఈ యంత్రాల ద్వారా రైతులు తాము కోరుకున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇతర వ్యవసాయ పనిముట్లు కోరుకున్న కంపెనీల నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా 416 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 389 డిజిటల్ కియోస్క్ యంత్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో యంత్రానికి రూ.70 వేలు వెచ్చించింది. పంట సాగు, తెగుల్ల నివారణ, తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులు తదితర అంశాలపై టీవీ కార్యక్రమాల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఒక్కో టీవీని రూ.45 వేలు చెప్పున కొని రైతు భరోసా కేంద్రాల్లో ఉంచారు. వ్యవసాయ సిబ్బంది వీటికి తమ మొబైల్ ద్వారా నెట్ కనెక్టు చేసుకొని కొన్ని నెలల పాటు వినియోగించినా ప్రస్తుతం మూలకు చేరాయి. సరైన నిర్వహణ లేక కొన్నింటికి బ్యాటరీలు పనిచేయక పోవడం, మరికొన్ని మరమ్మతులకు గురికావడం, డిష్, ఇంటర్ నెట్ సౌకర్యం లేకపోవడం తదితర సమస్యలతో ఈ యంత్రాలు మూలకు చేరాయి. కొన్నిచోట్ల టీవీలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం ఆయా కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికే పెద్ద ఎత్తున నిధులను వృథా చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు.

మొబైల్ యాప్‌ల రాకతో నిరుపయోగంగా కియోస్క్‌లు

ప్రతి మారుమూల గ్రామాల్లోని రైతులకు సైతం ఉపయోగపడే విధంగా గూగుల్ కంపెనీ పలు విత్తనాలు, పురుగు మందుల కంపె నీలు, పంటలకు సంబంధించి మొబైల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ఈ డిజిటల్ కియోస్క్ యంత్రాల జోలికి ఎవరూ పోవడం లేదు. దీంతో అవి రైతుసేవా కేంద్రాల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ డిజిటల్ కియోస్క్ యంత్రాల ఎదుట రైతులు నిలబడి స్ర్కీన్‌ను వేలితోతాకి, ఆధార్, ఫోన్ నెంబర్ ఎంటర్‌చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. లాగిన్ అవగానే వివిధ కంపెనీలకు సంబంధించి రకరకాల పంటల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వాటి బొమ్మలు, వాటి ధరలు స్ర్కీన్‌పై కనిపిస్తాయి. దీంతో రైతు కంపెనీని ఎంపిక చేసుకొని, ఆర్డర్ చేస్తే ఆయా కంపెనీలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రెండు, మూడు రోజుల్లో సరఫ చేస్తాయి. ఇంత ఉపయోగం ఉన్న యంత్రాల నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారడంతో వీటిని గత ప్రభుత్వమే పక్కన పెట్టిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.



కొత్తచెరువు రైతుసేవా కేంద్రంలో పనిచేయని డిజిటల్ కియోస్క్ యంత్రం

ఆదరణ తగ్గింది

ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించి వివిధ రకాల మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు వాటిని వినియోగిస్తూ, కియోస్క్ యంత్రాలను పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టు పూర్తి కావడంతో ఈ యంత్రాల నిర్వహణ ఆగింది. కొన్ని చోట్ల యంత్రాలు పని చేస్తున్నాయి. మరికొన్ని చోట్ల బ్యాటరీల సమస్యతో యంత్రాలు పనిచేయలేదు. ప్రభుత్వానికి మొబైల్ యాప్ నిర్వహణ కంటే ఈ కియోస్క్ యంత్రాల నిర్వహణకు అయ్యే వ్యయమే ఎక్కువ

-సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

295 బస్తాల బియ్యం సీజ్



సీజ్‌చేసిన వాహనం వద్ద అధికారులు

తాడిపత్రి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె క్రాస్‌వద్ద శుక్రవారం కర్ణాటకకు తరలిస్తున్న 295ప్యాకెట్ల రేషన్ బస్తాలతోపాటు ఐషర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారి ప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్ నాగేంద్ర, క్లీనర్ సురేష్, యజమాని నాగార్జున, వాహన యజమాని రామచంద్రలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ముగిసిన శిక్షణ

అనంతపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. కళాశాల ది ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెల్ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజ్లీ యోజనపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి హాజరై మాట్లాడారు. గత నెల 28వతేదీన ఈ శిక్షణ ప్రారంభమైందన్నారు. ఇందులో 150మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తర్వాత అందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఎన్ఐఈఎస్‌బీయూడీ సీనియర్ కన్సల్టెంట్ యామిని జైస్వాల్, ఒడిశా చీఫ్ కన్సల్టెంట్ ప్రభాకర్ బహుగుణ, రాష్ట్ర కోర్డినేటర్ ప్రకాశ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న వాన

(5వ పేజీ తరువాయి)

పడింది. పుట్లూరు 4.8, అనంతపురం 4.2, విడపనకల్లు 4.0, రాప్తాడు 3.4, ఉరవకొండ 2.0, గుత్తి 1.8, బొమ్మనహాళ్‌లో 1.2 మీ.మీ వర్షపాతం నమోదైంది.

నల్లమాడలో అత్యధిక వర్షపాతం

జిల్లాలోని 18 మండలాల్లో వర్షం కురవగా, మిగిలిన మండలాల్లో వర్షం పడలేదు. ఇందులో గురు వారం రాత్రి 9 మండలాల్లో అత్యధిక వర్షం కురిసింది. నల్లమాడ మండలంలో అత్యధికంగా 50 మిల్లీమీటర్ల వర్షం పడింది. లేపాక్షి మండ లంలో 47.2 మిల్లీమీటర్లు, ఓబుళదేవరచెరువలో 45.4, తాడిమర్రి 39.2, నల్లచెరువులో 34.2, కదిరిలో 31.2, గోరంట్లలో 22.4,బుక్కపట్నం 22, ముదిగుబ్బలో 20.4,గాండ్లపెంటలో 20, తనకల్లు 18.8,ధర్మవరం 18.2, తలుపుల 15.4, నంబలపూలకుంట14.2, నల్లచెరువు చిలమత్తూరు 9.4,అమడగూరు 5.4,పుట్టపర్తి 3.2,కొత్తచెరువులో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలంలోని లింగారెడ్డిపల్లి, కణిశెట్టిపల్లి, నారేపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది.



రాజు రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు



వాన నీటితో నిండిపోయిన ఆర్టీసీ బస్టాండు పరిసరాలు

ఐదు రోజులకు వర్షసూచన

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి లేదా ఓ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్ష సూచన ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 32-33 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22-22.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. వాయవ్యం దిశగా గాలులు గంటకు 8-12కి.మీవేగంతో వీచే అవకాశము ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం 78-83, మధ్యాహ్నం 52-73 నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అనంతపురం 9న 22.4 మి.మీ, 10న 12 మి.మీ 11న 7.1 మి.మీ , 1.2న 2.8 మి.మీ 13న 5.1 మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 9న 30.3 మి.మీ, 10న 9.1 మి.మీ 11న 7.5 మి.మీ, 1.2న 2.6 మి.మీ 13న 4 మిమీ కురిసే అవకాశం ఉందన్నారు.



వర్షంలో చిరువ్యాపారుల అగచాట్లు



వానలో ఇబ్బంది పడుతూ స్కూటీపై వెళ్తున్న ప్రయాణికులు

'డబ్బు'ల్ రిజిస్ట్రేషన్

● డాక్టర్‌తో రూ.60లక్షలు అప్పు తీసుకున్న యజమాని
● చెల్లించలేక దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించిన వైనం
● తాజాగా మరొకరికి కూడా.. నిలదీసిన బాధితులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఒకరి పేరుతో ఉన్న ఆస్తిని మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం పరిపాటిగా మారింది. అనంతపురం నగరంలోని సాయినగర్ 6వ క్రాస్‌లోని రెండు దుకాణాలకు సంబంధించిన యజమాని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో బాధితులు అలా ఎలా చేయిస్తారని నిలదీస్తున్నారు. నగరానికి చెందిన ప్రదీప్ తనకు సాయినగర్‌లోని 6వ క్రాస్‌లో ఉన్న రెండు దుకాణాలను డాక్టర్ షరీఫ్‌కు అద్దెకు ఇచ్చారు. ఆ డాక్టర్ అక్కడ ఐ కేర్ క్లినిక్ నిర్వహిస్తున్నాడు. 2019లో ప్రదీప్ డాక్టర్‌తో రూ.60లక్షల వరకు డబ్బు తీసుకున్నాడు. అయితే ఆ డబ్బు తిరిగి ఇవ్వలేకపోయాడు. దీంతో 2024 ఏప్రిల్‌లో ఆ రెండు దుకాణాలను డాక్టర్ షరీఫ్‌కు రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే ఐదు నెలల కిందట ప్రదీప్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. తాను డాక్టర్ షరీఫ్‌తో డబ్బు తీసుకున్న విషయం వాస్తవమేనని, ఆ దుకాణాల ఆస్తి విలువ రూ.1.2కోట్ల వరకు ఉందని తెలిపాడు. తెలియక రిజిస్ట్రేషన్ చేయించానని రద్దు చేయించాలని కోరారు. దీంతో పోలీసులు డాక్టర్ షరీఫ్‌ను పిలిపించారు. తనకు డబ్బు ఇవ్వనందుకే రిజిస్ట్రేషన్ చేయించారని, అవసరమైతే ఎంత డబ్బు ఇంకా ఇవ్వాల్సి ఉందో అంత ఇస్తానని ఆయన చెప్పాడు. ఇందుకు సీఐ శ్రీకాంత్... ఈ విషయంలో తామేమీ చేయలేమని, రిజిస్ట్రేషన్ అధికారులను లేదా కోర్టును ఆశ్రయించాలని సూచించారు. కానీ మే నెలలో ప్రదీప్ శివశంకర్ అనే వ్యక్తికి అదే దుకాణాలను రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో బాధిత వర్గం తమకు రిజిస్ట్రేషన్ చేయించిన ఆస్తిని మరొకరికి ఎలా రిజిస్ట్రేషన్ చేయిస్తారని నిలదీశారు. తాము మార్ట్‌గేజ్ పేరుతో రుణం తీసుకున్నా రిజిస్ట్రేషన్ చేశారని, దీని వెనుక అధికారపార్టీ నేతల అండ ఉందంటున్నారని బాధితులు వాపోతున్నారు.

డబుల్ చెల్లుతుందా..?

మ్యుటేషన్‌లో ప్రదీప్ పేరు ఉండటంతో అదే ఆస్తిని అధికారులు డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈసీ చూసి ఉంటే వ్యవహారం బయటపడేది. కాగా డబుల్ రిజిస్ట్రేషన్ ఎప్పటికీ చెల్లదని అధికారులు అంటున్నారు. ఈ విషయంపై బాధితులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఇరువర్గాలకు నోటీసులు జారీ చేశారు. తాజాగా అక్రమ రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ అధికారుల నివేదిక మేరకు కలెక్టర్ రద్దు చేసే అవకాశముంది. ఇక్కడ ప్రదీప్ శివశంకర్‌తో పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించి ఉంటాడని భావిస్తున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్ చెల్లదని తెలిసినా శివశంకర్ ఎలా చేయించుకున్నాడో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

తేనెటీగల దాడిలో వృద్ధుడి మృతి



ఆంజనేయులు(ఫైల్)

రాయదుర్గంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఆంజనేయులు(62) మృతి చెందిన సంఘటన శుక్రవారం గౌడ లేఅవుట్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో నివాసం ఉంటున్న ఆంజనేయులు తనకున్న మేకలను మేపేందుకు పట్టణంలోని గౌడ లేఅవుట్‌కు వెళ్లాడు. మేకల మేత కోసం రాగి ఆకులు కోస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. స్థానికులు గుర్తించి అతడిని రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య వసంతమ్మ, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

బుక్కపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారాల రిజర్వాయర్‌లో గుర్తు తెలియని పురుషుడి శవం లభ్యమైనట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. రిజర్వాయర్ సమీపంలో దుర్వాసన రావడంతో పలువురు రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం ఎస్ఐ వెళ్లి పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. మృతుడి వివరాలు వైద్యుల నివేదిక ద్వారా తెలుస్తాయన్నారు.

జీడిపల్లి రిజర్వాయరుకు 2,110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,110 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 2070 క్యూసెక్కులు వుండగా రిజర్వాయరులో నీటి నిల్వ 1.806 టీఎంసీలు వుందని వెల్లడించారు.

బిగుస్తున్న ఉచ్చు..!

పుట్టపర్తి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): వ్యాపారాలపేరుతో సన్న, చిన్నకారు రైతుల మొదలుకుని బడా వ్యాపారులు, రాజకీయ నేతలదాకా అందరినీ కోట్లలో మోసం చేసిన ఆర్థిక నేరగాళ్లు, వైసీపీ నాయకులు కొత్తచెరువుకు చెందిన దాల్‌మిల్ సూరి సోదరులపై పోలీసులు ఉచ్చు బిగిస్తున్నారు. తాజాగా దాల్‌మిల్ సూరిపై జిల్లా పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. వారి మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కొత్తచెరువుకు చెందిన వైసీపీ నాయకుడు దాల్‌మిల్ సూరి (మొరంశెట్టి సురేష్) వ్యాపారాల పేరుతో పదేళ్లుగా జిల్లాతోపాటు పలు రాష్ట్రాల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి, పలు రంగాల్లో వ్యాపారాలకు వైట్ కాలర్ మోసాలకు పాల్పడినట్లు కేసలు నమోదయ్యాయి. రూ.200 కోట్లదాకా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిలదీస్తే బాధితులపైనే దాడులు చేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఇటీవల కొత్తచెరువులో ఓ భూ వివాదంలో బాధితులపై తీవ్రంగా దాడి చేయడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో దాల్‌మిల్ సూరితోపాటు అతడి సోదరుడు పాండు, అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో వారు చేసిన ఘనారా మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి

దాల్‌మిల్ సూరి సోదరుల కోసం పోలీసుల వేట

వస్తున్నాయి. బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థల వివాదం కేసులో దాల్‌మిల్ సూరి సోదరుడు పాండును జూన్‌లో అరెస్టు చేయగా.. బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్రస్తుతం పాండు పరారీలో ఉన్నాడు. అప్పటి నుంచి దాల్‌మిల్ సూరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇటీవల వీరి ఆర్థిక మోసాలతోపాటు అక్రమాలు, దౌర్జన్యాలపై బాధితుల ఫిర్యాదులు చేయడంతో పోలీసులు చర్యలు మొదలుపెట్టారు. ఈనేపథ్యంలోనే దాల్‌మిల్ సూరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, లుకౌట్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే దాల్‌మిల్ సోదరులపై అన్నివైపుల నుంచి ఉచ్చు బిగుస్తునట్లు స్పష్టమవుతోంది.

బాధితుల ఫిర్యాదులు

దాల్‌మిల్ సూరి సోదరుల మోసాలపై జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి బాధితులు వచ్చి కొత్తచెరువు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దాల్‌మిల్ సూరి తన వ్యాపారాల వ్యూహాలతో 15 ఏళ్లగా అప్పుమీద ఆహార ధాన్యాలు మొదలుకొని పలు హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ భారీ మోసాలకు పాల్పడినట్లు నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. గత ఆరు నెలల్లో 7 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇలా ఇప్పటికే అతడిపై 36 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. గత మూడేళ్లుగా దాల్‌మిల్ సూరితోపాటు అతడి సోదరుడు పాండుపై ఆర్థిక నేరాల్లో నమోదైన కేసుల్లో బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా కోరిందంటే ఆర్థిక నేరాలు ఏమేరకు చేశారో తెలుస్తోంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడిన దాల్‌మిల్ సూరి దేశం విడిచి వెళ్లిపోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేస్తున్నట్లు జిల్లా పోలీసు యంత్రాంగం తెలిపింది. దాల్‌మిల్ సోరుదుల బాధితులు ముందుకు రావాలని పోలీసు శాఖ చెబుతోంది. పాండుపై జిల్లాతోపాటు ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో 47 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. అతడి బాధితుల్లో బడా వ్యాపారుసులతోపాటు రాజకీయ నేతలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారంలో వాటా ఇస్తామని జిల్లాకి చెందిన ఓ మాజీ మంత్రికి ఏకంగా రూ.50 లక్షలకు కుచ్చుటోపీ పెట్టినట్లు తెలుస్తోంది. ఆలా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలో చాలామంది వీరి చేతిలో మోసపోయినట్లు తెలుస్తోంది. బయటకు చెప్పుకోలేకపోతున్నారు. దాల్‌మిల్ సూరి సోదరులకు పలుసార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా.. ఏమాత్రం మార్పురాలేదు. వీరి ఆట కట్టించేందుకు పోలీసులు చర్యలు మొదలు పెట్టారు. వారి కోసం వేట సాగిస్తున్నారు. దీనిని బట్టి చూస్తే దాల్‌మిల్ సోదరులకు పోలీసు ఉచ్చు బిగుస్తోందన్నది స్పష్టమవుతోంది.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరి అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ మోసెస్ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. కదిరి మున్సిపాలిటీ, కదిరి మండలం, ముదిగుబ్బ, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, అమడగూరు, ఓడీసీ, నల్లమాడ మండలాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని డీఈ కోరారు.

24న జేవీవీ జిల్లా మహాసభ

ధర్మవరం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 24న జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. స్థానిక సూర్యస్కూల్‌లో శుక్రవారం జేవీవీ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ మహాసభను ఈ ఏడాది ధర్మవరంలో నిర్వహించాలని తీర్మానించామన్నారు. నూతన కమిటీని ఎన్ను కుంటామని తెలిపారు. జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు, లోకేష్, సురేష్, మల్లికార్జున, మనోహర్, ఖలందర్ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ



నల్లచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : తనకల్లు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా నల్లచెరువు మండలానికి చెందిన జింకా లక్ష్మీనారాయణ శుక్రవారం నియమితుల య్యారు. తనకు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన తెలిపారు.

కేజీబీవీ ఎదుట ధర్నా

తనకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ కళాశాలలో చదువుతున్న తమ కుమార్తె నాలుగు రోజుల క్రితం ఈ పాఠశాల నుంచి వెళ్లిపోయిందని, ఈ విషయంలో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు మండిపడ్డారు. ఈ విషయంపై తాము నాలుగురోజల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక కేజీబీవీ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఆందోళన రెండు గంటలపాటు కొనసాగింది. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పొరపాట్లు జరిగాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయం మరొకరికి జగకూడదన్నారు. ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు వెళ్లి ఆందోళన కారులతో మాట్లాడి విరమింపచేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

దళిత వ్యతిరేకి వైసీపీ

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం కొలువై ఉన్న తిరుపతిలో వైసీపీ నాయకులు క్రూరంగా దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో ఆయన అనుచరులు ఒక దళిత యువకుడిపై చేసినదాడినిచూస్తే వైసీపీ దళిత వ్యతిరేకి అని స్పష్టమవుతోందన్నారు. విచక్షణ రహితంగా కొట్టడమేకాక వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం బాధితులను భయపెట్టడం చూస్తే వారు ఎంతటి క్రూరమైనవారో అర్థమవుతుందన్నారు. పవిత్రమైన తిరుమలలో ఇలాంటివారు ఉండటం భావ్యం కాదన్నారు.

మార్కెట్‌యార్డు డైరెక్టర్లకు సన్మానం



డైరెక్టర్ ప్రవీణను సన్మానిస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన మండలానికి చెందిన బుద్దల ప్రవీణ, మస్తానమ్మ, షేక్‌నిజాంను శుక్రవారం టీడీపీ నాయకులు, వడియారాజుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీలో మండలానికి చెందిన నలుగురికి అవకాశల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఎంపీ జాకీర్ అహమ్మద్, ఇర్షాద్, బాలక్రిష్ణా రెడ్డి, వడియారాజుల సంఘం మండలాధ్యక్షుడు ఇడగొట్టు అంజనేయులు, ఉపాధ్యక్షుడు దెరంగుల చెన్నకేశవులు, వీరాంజనేయులు, శ్రీనివాసులు, కేప్ రామిరెడ్డిపల్లి ఆంజి తదితరులు వారిని సన్మానించారు.

ఆర్థికసాయం

కదిరి అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ హెడ్‌గార్డుగా పదవీ వీరమణ పొందిన అబ్దుల్‌రవూఫ్ గురువారం మృతిచెందారు. ఆయన అంత్య క్రియ లకు కదిరి డిపో పదవీ వీరమణ ఉద్యోగుల సంక్షేమ సంఘం తరఫున రూ. ఐదువేలు, సంఘం గౌరవాధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి రూ. ఐదువేలు, మొత్తం రూ.పదివేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. సంఘం నాయకులు హరిమోహన్, బాషా, సురేంద్రరెడ్డి, సలాం, నరసింగరావు, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

పగటిపూట విద్యుత్ కాంతులు



కోట్లపల్లిలో పగటిపూట వెలుగుతున్న విద్యుత్ దీపాలు

గాండ్లపెంట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ప లు గ్రామాల్లో పగటి పూట కూడా ఎల్ఈడీ (వీధి దీపాలు) కాంతులు విరజిమ్ముతున్నాయి. గ్రామాల్లో పలు వీధుల్లో చీకటి లేకుండా పంచాయతీ ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అవి పగలు, రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. దీంతో కరెంటు ఎంతో వృథా అవుతోందని ప్రజలు అంటున్నారు. ఎల్ఈడీ బల్బులు ఆఫ్ చేయడానికి ఆ వీధుల్లో ఎక్కడా స్విచ్‌లు ఏర్పాటు చేయలేదు. దీంతో నిరంతరం వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టి వీధి దీపాలను ఆఫ్ చేయడానికి బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పగటి పూట వాటిని ఆఫ్ చేయడానికి చొరవ చూపాలని, దీంతో విద్యుత్ ఆదా అవడమేకాకుండా ప్రజలపై అదనపు భారం తగ్గే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

కట్టించారు... వదిలేశారు

● నిరుపయోగంగా ఆర్ఎస్‌కే భవనం
● రూ.18లక్షల ప్రజాధనం వృథా



నిరుపయోగంగా ఉన్న ఆర్ఎస్‌కే భవనం, చుట్టూ పెరిగిన కంపచెట్లు

ధర్మవరం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మల గ్రామంలో ఉన్న రైతుసేవాకేంద్రాన్ని కట్టించారు. ప్రారంభించి నిరుపయోగంగా వదిలేశారు. రూ.లక్షలు నిధులు వెచ్చించి నిర్మించిన భవనంలో విధులు నిర్వర్తించకపోవడంతో... ప్రస్తుతం దాని చుట్టూ కంపచెట్లు పెరిగి అధ్వానంగా తయారైంది. రూ. 18లక్షలతో ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని ప్రారంభించి వదిలేశారు. ప్రభుత్వాలు లక్షల రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తే వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిధులన్నీ వృథాఅయినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. తుమ్మలలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్ర దగ్గరగా లేవు. దీంతో ఆ భవనాన్ని వాడుకోకుండా సచివాలయంలోనే రైతుసేవాకేంద్రం సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కారణంగా ఆ భవనం నిరుపయోగంగా మారిందని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే ఆ భవనాన్ని ప్రారంభించి నప్పుడు వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం అని బోర్డు పెట్టారు. నేటికి అదే ఉంది. ప్రభుత్వాలు మారినా కార్యాలయాలకు మాత్రం గత ప్రభుత్వాల పేర్లు ఉండటంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవన పరిసరాలను శుభ్రం చేసి, రూ. లక్షలు వెచ్చించి నిర్మించిని భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో బస్టాండ్



బస్టాండ్ దుస్థితి

● ధర్మవరం రూరల్: మండలంలోని తమ్మల గ్రామంలో ప్రధాన రహదారిలో ఉన్న బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. బస్టాండ్ గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గ్రామానికి చెందిన ప్రయాణికులు ధర్మవరం వెళ్లాలంటే బస్టాండ్ వద్దకు వచ్చి ఆటోలకు వెళుతుంటారు. బస్టాండ్ పూర్తి అసౌకర్యంగా ఉండటంతో వారు ఆటోల కోసం ఎండలో నిలబడాల్సి వస్తోంది. దీనిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ మరమ్మతులు చేపట్టి, ప్రయాణికులకు అనుకూలంగా సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ధర్మవరంలోని జర్నలిస్టుల కాలనీలో పూజలందుకున్న వరలక్ష్మీదేవి



ధర్మవరంలో విశేష అలంకరణలో వాసవీమాత



గాజుల అలంకరణలో సాలేవీధి పెద్దమ్మ

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

ధర్మవరం రూరల్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారి మూల విరాట్‌ను దూది హారాలతో విశేషంగా అలంకరించారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని సాలేవీధిలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో వరలక్ష్మీ పండుగ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను బుగ్గ వంశస్థులు తెచ్చిన గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వెంకటేష్‌శర్మ ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం చేశారు. వరలక్ష్మీవ్రతాన్ని పట్టణ, మండలవ్యాప్తంగా ఇళ్లలో, ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు.

● బత్తలపల్లి: మండలవ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బత్తలపల్లిలోని వడ్డే వీధిలో వెలసిన లక్ష్మీదేవి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. పూజారి రమణ య్య, రామంజి, సురేష్, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● అమడగూరు/ఓబుళదేవరచెరువు/తనకల్లు: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం అమడగూరు, ఓబుళదేవరచెరువు, తనకల్లు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఇళ్లు, ఆలయాల్లో వరలక్ష్మీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, వ్రతాన్ని ఆచరించారు.



బత్తలపల్లిలో వరలక్ష్మీదేవి



అమడగూరు కొక్కంటివారిపల్లిలో...



ఓబుళదేవర చెరువులో..



తనకల్లు కొక్కంటిక్రాస్‌లో...



గొట్లూరులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఓటర్ల తొలగింపుపై నిరసన



పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో తొలగించిన ఓటర్ల జాబితాను సుప్రీం కోర్టుకు సమర్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీహార్‌లో జరిగిన ఓటర్ల రద్దును నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల సందర్భంగా దాదాపు 80లక్షల మంది ఓట్లను గల్లంతుచేశారి, వారిలో ఎక్కువమంది బడుగు బలహీన బీసీ వర్గాల ప్రజలు, మైనారిటీలు వలస వెళ్లిన వారు ఉన్నారన్నారు. ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా ఓట్లు నమోదు అవుతాయనే అనుమానంతో అర్హులైన ఓటర్లను జాబితాలో నుంచి తీసివేశారని విమర్శించారు. ఆ విధంగా తొలిగించిన ఓటర్ల లిస్టును సుప్రీంకోర్టుకు అందచేయాలని ఆదేశాలున్నా ఇప్పటికీ సంబంధిత అధికారులు స్పందింలేదన్నారు. పైగా సమయం సరిపోదని తెలపడం వెనుక పూర్తిగా అధికార పార్టీ హస్తం ఉందని ఆరోపించారు. ఇటువంటి విధానాలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం మానుకోవాలని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఈఎస్ వెంకటేశు, జడ్‌పీ శ్రీనివాసులు, దిల్షాద్, లక్ష్మీనారాయణ, సీపీఎం నాయకులు మారుతి, రమణ ఆదినారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూలనపడిన బ్యాటరీ సైకిళ్లు



ఓ గదిలో పెట్టెలకే పరిమితమైన బ్యాటరీ సైకిళ్లు

కొత్తచెరువు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భవిత కేంద్రంలోని దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లను సరఫరా చేసింది. వాటిని దివ్యాంగులకు పంపిణీ చేయకుండా మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాల డైనింగ్ హాల్‌లో మూలన పడేశారు. దీంతో అవి ఆ గదిలో పెట్టెలకే పరిమితమయ్యాయి. ఈ సైకిళ్లను ఐదు నెలల క్రితం సరఫరా చేశారు. దీంతో ఒక్కొక్కటి రూ.50 వేలు విలువ చేసే బ్యాటరీ రీచార్జ్ సైకిళ్లు మూలనపడి నిరుప యోగంగా మారుతున్నాయి. అయితే సంబంధిత కంపెనీ వారు ఆ సైకిళ్లకు బ్యాటరీలు అమర్చడానికి రాకపోవడంతో వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయలేకపోతున్నామని భవిత కేంద్రం అధికారి ఆనంద్‌బాబు తెలిపారు. ఈ సైకిళ్లు జిల్లా పరిధిలో కదిరి, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి మండలాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. త్వరలోనే కంపెనీ వారికి తెలియజేసి వాటిని వినియోగంలోకి తెస్తామని, లబ్ధిదారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

నల్లమాడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ పదవులు లభిస్తాయని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం సింగల్ విండో చైర్మన్‌గా గడ్డం రమణారెడ్డి, డైరెక్టర్లుగా గంగులప్పనాయుడు, నాగేనాయక్ ప్రమాణం స్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు ఎమ్మెల్యే, మాజీ మంత్రితో పాటు చైర్మన్ మండలకేంద్రంలోని సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజకు పూజలు చేశారు. అనంతరం సహకార బ్యాంక్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రమాణస్వీకారానంతరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాట్లాడుతూ టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన యేడాదిలోనే ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. తాము కోరిన వెంటనే ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు స్పందించి, సత్యసాయి బాబా శతజయంతిని, స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగలుగా గుర్తించారన్నారు. బుక్కపట్నం చెరువు కింద ముంపు రైతులకు న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా రేపరెపలాడాలని అన్నారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లను ఎమ్మెల్యే, మాజీ మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, సర్పంచ్ భారతి, నాయకులు సామకోటి ఆదినారాయణ, సలాంఖాన్, బుట్టి నాగభూషణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, కొక్కంటి మంజునాథ్‌రెడ్డి, శివారెడ్డి, అబ్బాస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

● మహమ్మదాబాద్ పంచాయతీ ప్రజల మండిపాటు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

అమడగూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వేళ పాళలేని విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నామని మహమ్మదాబాద్ పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ సబ్‌స్టేషన్‌లో పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలు శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గురువారం నుంచి 24గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. చినుకురాలితే కరెంటు కట్ చేస్తారన్నారు. విద్యుత్ సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు బిల్లులు కట్టడం ఒక్కరోజు ఆలస్యమైతే రూ.వంద అపరాధ రుసుం వసూలు చేస్తారని, కరెంటు ఇవ్వడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడంలేదని మండిపడ్డారు. గత యేడాదిగా ఇదే సమస్య ఎదరవుతోందని ఆవేదన చెందారు. ఈ విషయంపై ఏఈ చంద్రనాయక్‌ను వివరణ కోరగా... రెండు ఫీడర్లు మరమ్మతుల్లో ఉన్నాయని, వాటిని మరమ్మత్తులు చేయడానికి సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే కరెంటు సరఫరా చేస్తామన్నారు.

దెబ్బతిన్న కల్వర్టు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



విజయనగర కాలనీలో దెబ్బతిన్న కల్వర్టు

కొత్తచెరువు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయనగర్ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు దెబ్బతింది. దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతు న్నారు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. స్థానిక సర్పంచ్ ఇంటి ఎదుటే కల్వర్టు దెబ్బతిందని, అయినా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోకపోవడంపై ఆ కాలనీవాసులు పెదవిరిస్తున్నారు. కల్వర్టు దెబ్బతినడం వల్ల ఫిల్టర్ నీటిని సరఫరా చేసే వాహనాలు కూడా అటు వైపు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దెబ్బతిన్న కల్వర్టుకు మరమత్తులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

శిల్ప సంపదను కాపాడుకుందాం

● మాజీ ఎమ్మెల్యే పార్థసారథి



కంబం నరసింహస్వామి ద్వారం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

గాండ్లపెంట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పురావస్తు శిల్పకళలను కాపాడుకుందామని మాజీ ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో ఉన్న కంబం నరసింహస్వామి ముఖద్వారాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో కదిరి నరసింహస్వామి ఆలయానికి చేరాలంటే ఈ ద్వారం గుండా వెళ్లేవారన్నారు. అప్పటి నుంచి ద్వారనాల అని పేరు వచ్చిందన్నారు. అయితే ఇక్కడి పురాతన శిల్పాలను దుండగులు పడకొట్టారని, ఇలాంటి వాటిని కాపాడుకోవాలన్నారు. కంబం నరసింహస్వామి శిల్పకళను కాపాడుకోవడానికి కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రత్యేక నిధులతో వాటి పరిరక్షణ పనులు చేపట్టడానికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ ధర్మజాగరణ సభ్యులు నరసింహరావు, బీజేపీ నాయకులు కేశవరెడ్డి, గ్రామస్థులు ఓబులరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో అవినీతి

● సీపీఐ నాయకుల ఆరోపణ

ముదిగుబ్బ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీలలో అభివృద్ధి పేరిట భారీ ఎత్తున అవినీతి జరిగిందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలోని పంచాయతీ అధికారులతో పాటు సచివాలయం కార్యదర్శులు వారి పరిధిలో కొన్ని పనులు చేయకున్నా చేసినట్లు రికార్డులు సృష్టించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతిని అరికట్టాల్సిన మండల అధికారులు, కొందరు నాయకులు వారికే మద్దతు పలుకుతుండడం పలు అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా మండలంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే పూర్తి ఆధారాలతో పంచాయతీ కార్యదర్శుల అవినీతిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై అన్నదాత ఆసక్తి

● ఎకరాకు 40క్వింటాళ్ల దిగుబడి
● వరి పంటను వదిలేస్తున్న వైనం..


ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

పెనుకొండ రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌లో విరివిగా వరిసాగుచేసే రైతన్నలు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వరి సాగుకు ఖర్చులు భారం కావడంతోనే మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలుకాగానే బీపీటీ, సోనామసూరీ రకం వరిపైర్లు సిద్ధం చేసేవారు. వరికి ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేలు ఖర్చవుతోంది. మార్కెట్‌లో బీపీటీ సోనా మసూరీ రకం క్వింటాల్ రూ.4000నుంచి రూ.4200ధరలు పలకడంతో పెట్టిన పెట్టుబడికూడా అందదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగువైపు రైతులు ఆసక్తిచూపుతున్నారు. కొన్నేళ్లుగా మొక్కజొన్న క్వింటాల్ ధర రూ.2,200పలకగా ఎకరాకు 35నుంచి 40క్వింటాళ్ల దిగుబడులు రావడంతో ఈ పంటనే వేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పెనుకొండ, రొద్దం మండలాల్లో 3వేల ఎకరాలకుపైగా సాగుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పెనుకొండ మండలవ్యాప్తంగా రబీ సీజన్ ప్రారంభంలో 900 హెక్టార్లకుపైగా మొక్కజొన్న పంట సాగుచేశారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో మొక్కజొన్న సాగుచేస్తూ అధిక దిగుబడి సాధించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు



మొక్కజొన్న సాగుచేసే రైతులు ముందుగా నేల స్వభావంబట్టి పశువుల ఎరువులు, కాంపోస్ట్ జిప్సం తదితర ఎరువులు వాడాలి. నేలను రెండు లేదా మూడుసార్లు దుక్కిదున్ని రొటావేటర్ వేయాలి. విత్తనం విత్తిన 20రోజులకు కలుపు నివారణ కోసం అట్రాసిన్ 0.25 మి.లీ. మందును పిచికారి చేయాలన్నారు. పచ్చపురుగు ఆశించినట్లయితే ఎకరాకు 8ఎంఎల్ క్లోరోటానిల్ ప్రోల్, సీయోమోటోస్కాం 0.4ఎంఎల్ నీటిలో కలుపుకుని పిచికారి చేయాలి. 25రోజుల తరువాత యూరియా కాంప్లెక్స్, డీఏపీ, పొటాష్ ఎరువులు వాడితే మొక్కజొన్న సాగులో అధిక దిగుబడులు పొందవచ్చు. - చందన, ఏఓ, పెనుకొండ

పెట్టుబడిపోను రూ.లక్ష ఆదాయం



గతంలో వరిపంటసాగుచేసి తీవ్రంగా నష్టపోయాం. వరిసాగుతో పెట్టుబడులు కూడా రాలేదు. రబీ సీజన్‌లో నాకున్న 2.10ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశా. 70క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడిపోను రూ.లక్ష ఆదాయం వచ్చింది. ప్రస్తుతం కూడా మొక్కజొన్న సాగుచేశాను.
- చలపతి, రైతు, కోనాపురం

మొక్కజొన్నసాగు రైతులకు ఎంతో మేలు



పొలంలో విత్తు విత్తినప్పటి నుంచి 130 రోజులకే మొక్కజొన్న పంట పండుతుంది. వ్యవసాయాధికారుల సలహాతో నాకున్న రెండెకరాల్లో రెండేళ్ల నుంచి మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నా. పంట వేసినప్పటి నుంచి ఎకరాకు 35క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాల్ రూ.2500పలుకుతోంది. ధరలు నిలకడగా ఉంటే మంచి ఆదాయం వస్తుంది. - శ్రీనివాసరెడ్డి, రైతు, కోనాపురం

న్యూస్ బాక్స్

కొల్లాపురి మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



రొళ్ల, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరిలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మీ అమ్మవారికి కాశికాంబ కమిటీశ్వర స్వామి, లక్ష్మీనరసింహస్వామి, కొత్త పాళ్యం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం వరమహాలక్ష్మీ పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

నిడిమామిడమ్మకు..



మడకశిర రూరల్, ఆగస్టు8(ఆంధ్ర జ్యోతి): మండలంలో అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మానిపల్లి నిడిమామిడమ్మ, మెళవాయిలోని చౌడేశ్వరీదేవి, కల్లుమర్రి ఆలయాల్లో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు.

చీనీకాయల అలంకరణలో వడిసలమ్మ



మడకశిర టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ వద్ద వెలసిన వడిసలమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం చీనీకాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం వరలక్ష్మి పండుగా కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కొల్లాపురమ్మ, గంగాభవాని, పూజమ్మ, మూలకంఠేశ్వరి ఆలయాల్లో దీపారాధన విశేష పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

దళిత వ్యతిరేకి వైసీపీ

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



హిందూపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం కొలువై ఉన్న తిరుపతిలో వైసీపీ నాయకులు క్రూరంగా దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో ఆయన అనుచరులు ఒక దళిత యువకుడిపై చేసినదాడిచూస్తే వైసీపీ దళిత వ్యతిరేకి అని స్పష్టమవుతోందన్నారు. విచక్షణ రహితంగా కొట్టడమేకాక వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం బాధితులను భయపెట్టడం చూస్తే వారు ఎంతటి క్రూరమైనవారో అర్థమవుతుందన్నారు. పవిత్రమైన తిరుమలలో ఇలాంటివారు ఉండటం భావ్యం కాదన్నారు. వైసీపీ చేస్తున్న రౌడీయిజం చూస్తుంటే సామాన్యులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రాఖీ వేడుక


కరస్పాండెంట్‌కు రాఖీలు కడుతున్న విద్యార్థులు

పెనుకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ (రాఖీపౌర్ణమి) వేడుకలను స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటారు. ఆయన మాట్లాడుతూ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి నిదర్శనం ఈ రాఖీపండగ అన్నారు.

ఘనంగా ఎరుపు దినోత్సవం


ఎరుపు రంగు దుస్తులతో నర్సరీ విద్యార్థులు

పెనుకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో ఎరుపు దినోత్సవాన్ని కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నర్సరీ విద్యార్థులు ఎరుపురంగు దుస్తులు, టోపీలు ధరించారు. ఎరువు కాయలు, బొమ్మలు, చేతబట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ రంగుల దినోత్సవం నిర్వహించడంవల్ల విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఉపాధ్యాయులు సంధ్య, శారద, పింకి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొళ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొళ్ల, బీజీహళ్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నిజాముద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అత్యవసర మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హిందూపురం హెచ్‌సీఎల్ జట్టు గెలుపు

మడకశిర టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఎంఎస్ఆర్-జీటీఎస్ టీ20 లెదర్ బాల్ క్రికెట్ టోర్నీలో హిందూపురం హెచ్‌సీఎల్ జట్టు విజయం సాధించింది. శుక్రవారం మొదటి మ్యాచ్‌లో మడకశిర బీస్ట్ జట్టు, హిందూపురం హెచ్‌సీఎల్ జట్టు తలపడ్డాయి. బీస్ట్ జట్టు 18.3 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హెచ్‌సీఎల్ జట్టు 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. అభిమన్యు స్పోర్ట్స్, కల్చరల్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, సీఐ నాగేష్ బాబు హాజరయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేంద్ర, న్యాయవాది రాధాకృష్ణ, డాక్టర్ క్రిష్ణమూర్తి, కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

మడకశిర రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడినట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను 25వ తేదీలోపు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషర్ కార్యాలయానికి పంపించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి క్విట్‌ఇండియా ఉద్యమం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమానికి క్విట్ ఇండియా స్ఫూర్తి అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్‌వారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు క్విట్‌ఇండియా కీలకపాత్ర పోషించిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప మాట్లాడుతూ విదేశీ వస్తు బహిష్కరణద్వారా స్వదేశీ వస్తు ఉత్పత్తికి ఆదరణ పెరిగిందన్నారు. ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, అధ్యాపకులు కాంతారావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు భూమి కేటాయించండి


కృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బలిజలు

పెనుకొండ టౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి కొండపై శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు ఎకరం భూమి కేటాయించాలని బలిజ కులస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల 516పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం 44వ జాతీయరహదారివద్ద ఉన్న 50అడుగుల శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ విగ్రహానికి పూలమాలలువేసి నివాళిర్పించారు. వారుమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ యేడాది కృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించాలని, కొండపై భూమి కేటాయించాలని డిమాండ్ చేవారు. పట్టణ అధ్యక్షుడు సూరి, ప్రగతి శ్రీనివాసులు, బాలాజీ, రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మహర్దశ

● రూ.3కోట్లతో నిర్మాణాలకు శ్రీకారం


దెబ్బతిన్న వీరాపురం రోడ్డు

మడకశిర,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న రోడ్లకు మహర్దశ రానుంది. గత ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురైన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆ రోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలకు నరకంగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.3కోట్లు పీఆర్ ప్రాజెక్టుకు నాబార్డు కింద నిధులు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణాలకు టెండర్లు కూడా పిలిచారు. పీఆర్ పరిధిలోని 7.5 కిలోటర్లకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఇందులో మడకశిర మండలంలో అగ్రంపల్లి నుంచి సి.కొడిగేపల్లి రోడ్డుకు రూ.80లక్షలు, అమరాపురం నుంచి బంగారుపాళ్యంకు రూ.1.20 కోట్లు, అమరాపురం నుంచి వీరాపురం రోడ్డుకు కోటి రూపాయాలు మంజూరు చేశారు. త్వరలోనే రోడ్ల పనులు ప్రారంభమవుతాయని పీఆర్ డీఈ వెంకటేశులు తెలిపారు.

డాక్టర్‌కు బాగోలేదు.. తరువాత రండి..

● టీహెచ్‌ఓ నిర్లక్ష్యపు సమాధానం
● ఇబ్బంది పడుతున్న దివ్యాంగులు


డాక్టర్ కోసం వేచి ఉన్న దివ్యాంగులు

పావగడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు యూడీఐడీ కార్డుకు సంబంధించి సంతకం చేయించుకునేందుకు ఆర్థోపెడిక్ వైద్యుడి వద్దకు వస్తే టీహెచ్‌ఓ డాక్టర్ బాబు సంబంధిత డాక్టరుకు బాగోలేదని, వచ్చే వారం రావాలని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చినట్లు వికలాంగుల సంఘం అధ్యక్షుడు మైలార రెడ్డి ఆరోపించారు. ఆగస్టులో దివ్యాంగుల ఇంటికి గుర్తింపు ప్రమాణ పత్రం అందజేసి సంబరాలు జరుపుకోవాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి దివ్యాంగుడికి గుర్తింపు కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆర్థోపెడిక్ డాక్టర్ చందన్ వస్తారని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎదురుచూసి రాకపోవడంతో దివ్యాంగులకు నిరాశే ఎదురైంది. ఇప్పటికే మూడు నెలల నుంచి సర్టిఫికెట్లు అందక ఇబ్బందిపడుతున్న విలాంగులకు డాక్టర్ నిర్లక్ష్యంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం నుంచి ఏ పథకాలు పొందాలన్నా 80శాతం వికలాంగత్వం కలిగిన సర్టిఫికెట్ ఉంటేనే వర్తిస్తుందన్నారు. కాళ్లు చేతులు లేని నిస్సహాయులకు ఇటువంటి నిర్లక్ష్యవైఖరికి విడిచి వారికి సహకరించాలని ఆయన కోరారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ హుస్సేన్‌బాషాసాబ్


హజ్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

హిందూపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హజ్‌కమిటీ రాష్ట్ర చైర్మన్ హుస్సేన్‌బాషాసాబ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద ఆయన్ను హిందూపురానికి చెందిన ముస్లింలు సత్కరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ హజ్‌యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరికీ రూ.లక్ష ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2014-2019వరకు ముస్లిం మైనార్టీలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మసీదుల్లో పనిచేసే ఇమాం, మౌజన్లకు నెలనెల వేతనాలు అందించే పథకాన్ని తీసుకొచ్చింది తెలుగుదేశమేనన్నారు. హిందూపురంలో జామియా మసీదు నిర్మాణానికి రూ.2.5కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు ముస్లిం పట్ల ఉన్న అభిమానం చెప్పకనే చెప్పవచ్చన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, నారాలోకేష్ ముస్లింల అభివృద్ధి సంక్షేమానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. త్వరలోనే దుల్హన్ పథకం అమలు చేస్తామన్నారు. హజ్‌యాత్రికులకు విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణాన్ని ప్రారంభిస్తే వారి ఖాతాలో రూ.లక్ష జమ అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేష్, హజ్‌కమిటీ సభ్యులు డైమండ్‌బాబా, మాజీ మున్సిపల్ చైర్మన్ అనీల్, టీడీపీ మైనార్టీ నాయకులు అయూబ్, అస్మతుల్లా, నజీర్, దాదాఖాన్, అమీర్, ఫక్రుద్దీన్, అన్వర్, మహబూబ్‌బాషా, షబ్బీర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మీ వ్రతం


ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

పెనుకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోరిన వరాలిచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. గృహాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. స్థానిక సర్వశెట్టి ఫంక్షన్‌హాల్‌లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం ఆచరించారు.


అలంకరణలో అష్టలక్ష్మీదేవి

హిందూపురం: వరలక్ష్మీ పండగను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయం, వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతి ఇంటిలోనూ వరలక్ష్మీదేవి చిత్రపటాలు, అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పెనుకొండ రూరల్: వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు వ్రతాన్ని జరుపుకున్నారు మహిళలు వరలక్ష్మీ చిత్రపటానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు.

రొద్దం: మండలంలోని వివిధ గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. టీడీపీ మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య నరసింహులు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మడకశిర టౌన్: పట్టణంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని వివిధ దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, అలంకరణలు, అర్చనలు నిర్వహించారు. ఇళ్లలో ప్రత్యేకంగా కొబ్బరి చిప్పలు, ఇతరత్రా వస్తువులతో వరలక్ష్మీమాతను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి స్తోత్రాన్ని పఠించారు.


సామూహిక వ్రతం ఆచరిస్తున్న మహిళలు


నృత్యప్రదర్శనలో పాల్గొన్న కర్ణాటక చిన్నారులు

గోరంట్ల: మండల వ్యాప్తంగా వరమహాలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు భాస్కర్ సేవేంద్రశర్మ, రమాదేవి దంపతులు తమ నివాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

అగళి: మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు, ఇతరులు వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీ అష్టోత్తర శతనామావళి హారతి, అమ్మవారికి ఆభరణాలు, పూలు, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

అమరాపురం: మండలంలోని బసవనపల్లి గ్రామంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు రాజశేఖర్ తెలిపారు. వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి పరమేశ్వర్, క్లస్టర్ కో కన్వీనర్ మంజుతారక్ పాల్గొన్నారు. ఉప్పరపల్లి శివకుమార్, డీలర్, ఫీల్డ్అసిస్టెంట్ నాగరాజు, మోహన్, కుమార్, రంగస్వామి, చంద్రశేఖర్‌నాయక్, సతీష్‌కుమార్, కనకనపల్లి డీలర్ తిప్పేస్వామి పాల్గొన్నారు.


కలశాలతో వస్తున్న మహిళలు

గుడిబండ: మండలంలోని పలారం గ్రామంలో వెలసిన లక్ష్మీదేవి అమ్మవారికి మహిళలు హారతులు మోశారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

హిందూపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నా కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అయినా కొన్ని విద్యాసంస్థలు తరగతులు నిర్వహించాయన్నారు. ఇలాంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే మేం విద్యాసంస్థల ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ నాయకులు బాబావలి, భగత్‌రాజు, అనుదీప్, నజీర్, మహేష్, తిమ్మరాజు, గంగరాజు పాల్గొన్నారు.